





రొయ్యకు రేటేది?

- వంద కౌంట్ రూ.205, యాబై కౌంట్ రూ.270
- లబోదిబోమంటున్న ఆక్వా రైతాంగం
- రొయ్యకు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన
- విదేశీ ఆర్డర్లు లేకపోవడమే కారణమంటున్న పరిశ్రమ వర్గాలు
- ప్రభుత్వమూ పట్టించుకోవాలని రైతుల వినతి

మలికిపురం, జూలై 6: రైతులకు ఎన్నో ఏళ్ల సిరులు కురిపించిన ఆక్వా రంగం ఇప్పుడు ఊపి రాడని స్థితిని ఎదుర్కొంటోంది. విదేశీ ఎగుమతులతో రెండున్నర దశాబ్దాలపాటు విదేశీమారక ద్రవ్యం ఆర్జించిపెట్టడంలో ఒకనాడు ఈ రంగం అగ్రభాగాన నిలిచింది. చెప్పాలంటే వ్యవసాయం తర్వాత ఇప్పటికీ అతిపెద్ద రంగం ఆక్వానే. అయితే మార్కెట్ ఒడిదుడుకులు, ప్రభుత్వ విధానాల పర్యవసానంగా గత అయిదేళ్లకాలంలో ఆక్వా పరిశ్రమ దెబ్బతింది. దాంతో ఆక్వా రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అయినప్పటికీ భవిష్యత్తు మీద ఆశతో జిల్లా ఆక్వా రైతాంగం తమ అదృష్టాన్ని ఏటేటా పరీక్షించుకుంటోంది. నష్టాల ఊబిలో ఈదుతూనే ఆశాజనకమైన ఫలితాల కోసం పోరాడుతోంది. మన రొయ్యలకు చైనా, అమెరికా వంటి దేశాల్లో చాలా గిరాకీ ఉండేది. ఎగుమతులు భారీఎత్తున సాగాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అదేమంటే ఎగుమతులు పడిపోయాయని ఆక్వా పరిశ్రమ చెబుతోంది. ఈ నేపథ్యంలో వరుస నష్టాలతో చాలామంది రైతులు ఆక్వా సాగు నుంచి తప్పుకున్నారు. సాగు విస్తీర్ణం ఈ అయిదేళ్ల కాలంలో బాగా తగ్గిపోయింది. ఇటు దిగుబడులు తగ్గిపోయినప్పటికీ ఎగుమతులు లేవనే కారణంగా రొయ్యలకు ధరలు మాత్రం పెంచడం లేదు. ఈక్వెడార్ వంటి దేశాల నుంచి ఆక్వా ఉత్పత్తులు భారీగా పెరిగిపోవడం, అక్కడ నుంచి ఇతర దేశాలు ఎగుమతులకు ప్రాధాన్యం ఇవ్వడమే ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు ఒడిసా, గుజరాత్ సరిహద్దుల్లో సైతం ఆక్వా ఉత్పత్తులు భారీగా పెరిగాయి. అక్కడ మే నెల నుంచి ఆగస్టు మధ్య వరకు ఇబ్బడిముబ్బడిగా వస్తాయి. మన ప్రాంతంకంటే అక్కడ కిలోకు రూ.20 వరకు తక్కువ ఉండడంతో ఎగుమతిదారులు అక్కడి నుంచే కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అలాగని స్థానిక మార్కెట్లలోనూ గిరాకీ లేదు. గతంలో కలకత్తా, ముంబై వంటి నగరాల్లో 50కౌంట్‌కు పైబడిన రొయ్యలు వెళ్లేవి. ప్రస్తుతం అక్కడ కూడా మార్కెట్ లేదు. చైనాకు మన దేశం నుంచి ఆక్వా ఉత్పత్తులు బాగా వెళ్లేవి. అక్కడ మన రొయ్యల్లో నాణ్యతకు సంబంధించిన లోపాలను చూపి కొన్ని కంటైనర్స్ తిరిగి పంపడంతో ఆక్వా రైతుపై ఈ సమస్య కూడా రోకలి పోటులా తగిలింది. మరోవైపు గతంలో రొయ్యలకు వేసే మేత బస్తా రూ.1700 ఉన్నప్పుడు ఏ ధర ఉందో.. మేత బస్తా రూ.2200 ధర పలుకుతున్నా రొయ్యలకు అప్పటి రేటే కొనసాగుతోంది. కొన్నిసార్లు మరింత దిగజారుతోంది కూడా. మేతలు, మందుల ధరలు, లీజులు, మనుషుల కూలీ రేట్లు పెరిగాయి. రొయ్యల ధరలు మాత్రం పెరగలేదు. ప్రస్తుతం రాజోలు నియోజకవర్గంలో 10 వేల ఎకరాల వరకు ఆక్వా సాగు జరుగుతోంది. ప్రస్తుతం వంద కౌంట్ రూ.205, 90 కౌంట్ రూ.215, 80 కౌంట్ రూ.225, 70 కౌంట్ రూ.245, 60 కౌంట్ రూ.265, 50 కౌంట్ రూ.270 నుంచి రూ.280 ధరలు పలుకుతున్నాయి. వంద కౌంట్ రొయ్యకు కనీసం సంవత్సరంపాటు ఫిక్స్‌డ్ రేట్ రూ.230 నుంచి రూ.240 ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోగలిగితే ఆక్వా రైతులు కొంత ఊపిరిపీల్చుకుంటారు. అత్యధిక రైతాంగం ఆధారపడిన ఈ పరిశ్రమకు సంబంధించి ముఖ్యంగా నేరుగా రైతుకు ప్రత్యేక రాయితీలు అందజేయాల్సి ఉంది. మేత ధరలపై పర్యవేక్షణ ఉండడంతోపాటు కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటుచేయాలని రైతాంగం కోరుతోంది. హేచరీస్‌పై నిరంతరం నిఘాతో నాణ్యమైన సీడ్‌ను అందుబాటులోకి తేవడం కూడా అతి ముఖ్యమని వారు చెబుతున్నారు. జోన్‌ల పరిమితి లేకుండా విద్యుత్ సబ్సిడీ అందించాలని, ఎగుమతిదారులతో ఎప్పటికప్పుడు చర్చించే విధంగా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటుచేస్తే ఆక్వా ఎగుమతులను ప్రోత్సహించినట్టు అవుతుంది.

ఆశలన్నీ పండుగలపైనే



- దిగజారిన కొబ్బరి ధరలు
- వరుస పర్వదినాలపైనే రైతుల ఆశలు
- క్షీణించిన ఎగుమతులు
- ఇతర రాష్ట్రాల్లో ఆశాజనకంగా దిగుబడులు
- ఊపందుకోని నీటికాయ అమ్మకాలు

అంబాజీపేట, జూలై 6: రాష్ట్రంలో కొబ్బరి నాణ్యమైన దిగుబడులు లేక, ఇతర రాష్ట్రాల్లో దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ధరలు దిగజారాయి. ఈ ఏడాది జనవరి నుంచి ధరల పెరుగుదలలో పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఎకరా దింపు తీసిన ఖర్చులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు రాకపోవడంతో రోజుకు 20 లారీల సరుకు మాత్రమే ఎగుమతులు అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఆశాజనకంగా ఉండడంతో ఆయా రాష్ట్రాల నుంచి వివిధ రాష్ట్రాలకు కొబ్బరి అధికంగా ఎగుమతులు జరుగుతున్నాయి. అయితే త్వరలో వచ్చే నాగపంచమి, శ్రావణమాసం, రాఖీపౌర్ణమి, వినాయక చవితి పండుగలతో కొబ్బరి ధరలు పెరుగుతాయని రైతులు, వ్యాపారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మహిళలు రాఖీకడితే కానుకగా కొబ్బరికాయలను అందిస్తారని, దీంతో ఆయా ప్రాంతాలకు భారీగా కొబ్బరికాయల ఎగుమతి అయ్యే అవకాశాలు ఉండవచ్చని కొబ్బరి అప్పన కాశీప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఒడిసా రాష్ట్రాలకు మాత్రమే కొబ్బరి ఎగుమతులు అవుతున్నాయన్నారు. మరోవైపు వర్షాకాలం ప్రారంభం ఆలస్యంకావడం ఈ కొబ్బరి ఎగుమతులకు ఆటంకం కలుగుతోందన్నారు. వర్షాకాలం ప్రారంభం అయితే ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ పనులను ప్రారంభించే ముందే కొబ్బరికాయలు కొడతారని, దీంతో ఆయా ప్రాంతాలకు ఎగుమతులు అధికంగా అవుతాయని అయన తెలిపారు. వ్యవసాయ పనులను ప్రారంభిస్తే బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జోరుగా సాగుతాయి. అలాగే పండుగలైన నాగపంచమి, శ్రావణమాసం, రాఖీపౌర్ణమి, వినాయకచవితికి కొబ్బరి ఎగుమతులు మరింతగా జోరందుకుంటాయని ఆయన చెప్పారు.

నీటికాయ ధరల మాటేమిటి..

కోనసీమ ప్రాంతంలో రైతులు అధికంగా కొబ్బరిపైనే ఆధారపడి జీవిస్తారన్నది తెలిసిందే. గతంలో రైతులు ఎప్పుడు దింపు తీసినా పచ్చికొబ్బరికాయలను లేదా నెలరోజులపాటు నిల్వ ఉంచిన ముక్కుడు కొబ్బరికాయలను విక్రయిస్తూ జీవనం సాగించేవారు. అయితే ప్రస్తుతం కొబ్బరి దిగుబడులు తగ్గినప్పటికీ ధరలు ఏ మాత్రం పెరగలేదు. నీటికాయ ధరలు క్వింటాలుకు రూ.9 వేలు మాత్రమే ధరలు అందుతున్నాయి. గత మూడేళ్ల నుంచి ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇతర అన్ని సరుకుల ధరలు పెరుగుతున్నా కొబ్బరి ధరల్లో మాత్రమే మార్పు ఉండడంలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కొబ్బరి మార్కెట్ ధరలు ఇలా...

కొబ్బరి రకం	ధర(రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	9,500
కురిడీ కొబ్బరి(పాతవి) :	
గండేరా(వెయ్యి)	13,500
గటగట(వెయ్యి)	11,000
కురిడీ కొబ్బరి (కొత్తవి) :	
గండేరా(వెయ్యి)	10,00
గటగట(వెయ్యి)	9,000
నీటికాయ :	
పాత(ముక్కుడు)(వెయ్యి)	9,000- 9,500
కొత్త(పచ్చి) (వెయ్యి)	8,000-8,500

రేపు అంబాజీపేటలో నాఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

అంబాజీపేట, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని ఆయిల్‌ఫెడ్ ఎండీ చావెల బాబురావు ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీన అంబాజీపేటలో ప్రారంభిస్తున్నట్టు ఏపీ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. అంబాజీపేటలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. మిల్లింగ్‌కోప్రాకు క్వింటాల్‌కు రూ.11,160, బాల్‌కోప్రాకు రూ.12 వేలు మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ఆర్బీకేలలో నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి నోడల్ ఏజెన్సీ కృషీవల కోకోనట్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, ముత్యాల జమీలు ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. కొబ్బరి తేమ శాతం, దుమ్ము, ధూళి తదితర అంశాలను రైతులు పాటించాలన్నారు. మూడు నెలలపాటు కొబ్బరి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు కొబ్బరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సీసీ కెమెరాల నిఘాలోనే..

- రేపటి నుంచి ఉచిత ఇసుక విధానం అమలు
- కోనసీమ జిల్లాలో ఏడు ఇసుక నిల్వ కేంద్రాలు
- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, జూలై6(ఆంధ్రజ్యోతి): అత్యంత పారదర్శకంగా సీసీ కెమెరాల నిఘాలో ఈనెల 8 నుంచి జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేయడం జరుగుతుందని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్టంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్‌ఎస్‌సీ) సమావేశం జరిగింది. జిల్లాలోని వివిధ ఇసుక స్టాక్ పాయింట్లలో ఉన్న నిల్వలు, ఉచిత విధానం అమలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8వ తేదీ సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో ఏడు ఇసుక నిల్వ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో ఎంత మేర ఇసుక అందుబాటులో ఉందో ఆదివారం సాయంత్రంలోపు అధికారులు తిరిగి అంచనా వేయాలన్నారు. ఏడు స్టాక్ పాయింట్లను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఇన్‌చార్జిలను నియమిస్తామన్నారు. నిల్వ కేంద్రాల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని, ఇసుక నిల్వ కేంద్రాలు పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలోనే ఉంటాయన్నారు. మండల తహశీల్దార్ ఇసుక నిల్వ కేంద్రం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని, ఏయే స్టాకు పాయింట్లలో ఇసుక ఎంత నిల్వ ఉందో గనులు, భూగర్భశాఖ వెబ్‌సైట్‌లో సమాచారం ఉంటుందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా ఇసుక నిల్వచేస్తే కఠిన చర్యలు..

భవన నిర్మాణాలకు ఇసుక కావాల్సినవారు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మొదట వచ్చిన వారికి మొదటగా ఇసుకను కేటాయిస్తారు. ఇసుక తవ్వకం, లోడింగ్, రవాణా ఖర్చు, సీనరైజ్ ఫీజులు నామమాత్రంగా వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. ఆ చార్జీలు ఎంత మొత్తంలో వసూలు చేయాలో ఆదివారం నిర్ణయిస్తామని కలెక్టర్ చెప్పారు. వసూలైన మొత్తం నేరుగా జిల్లా, మండల పరిషత్, పంచాయతీలకు చేరుతుందన్నారు. ఆ మొత్తాన్ని రీచ్ ప్రాంత రహదారులు, ర్యాంపులు వంటి వాటిని నిర్మించేందుకు వినియోగిస్తారన్నారు. ఇసుక నిల్వ కేంద్రాల వద్ద నామమాత్రపు రుసుం వివరాలను ప్రదర్శించాలన్నారు. ఇసుకను తరలించే వాహనాలకు స్టాకు పాయింట్ల వద్దనే మాన్యువల్ పర్మిట్లు జారీ చేస్తామన్నారు. రోజుకు ఒక వ్యక్తికి 20 మెట్రిక్ టన్నుల ఇసుకను మాత్రమే ఇవ్వడం జరుగుతుంది. ఎక్కడైనా పెద్ద మొత్తంలో ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు. ఇతర రాష్ట్రాలకు ఇసుకను తరలించడం నిషిద్ధమన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, మైన్స్ రాయల్టీ ఇనస్పెక్టర్ వి.సుజాత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

సామాజిక భద్రతా పెన్షన్లను ప్రతీ నెలా మొదటిరోజునే నూరుశాతం పంపిణీ చేయాలి : కలెక్టర్

అమలాపురం టౌన్, జూలై6: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక భద్రతా పెన్షన్లను ప్రతీ నెలా మొదటిరోజునే నూరుశాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఎంపీడీవోలతోపాటు ఇతర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం జిల్లాలోని ఎంపీడీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి మాట్లాడారు. అత్యంత పారదర్శక, జవాబుదారీతనంతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. మొదటి నెలలో ఎక్కడైనా ఇబ్బందులు, సమస్యలు తలెత్తాయా అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల్లో కొందరు మృతిచెందిన కారణంగా నూటికి నూరుశాతం పెన్షన్ల పంపిణీ ప్రక్రియ జరగలేదని, కొందరు సొంత గ్రామాల్లో ఇంటి వద్ద నివాసం ఉండకపోవడంతో పెన్షన్ల పంపిణీలో కొంతమేర జాప్యం జరిగిందన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం నిర్దేశించిన 50 మంది లబ్ధిదారులకు మించకుండా మ్యాపింగ్ ప్రక్రియ, డిజిటల్ సహాయకుల ద్వారా చేపట్టాలని ఎంపీడీవోలకు సూచించారు. పెన్షన్ పంపిణీ చేసే మొదటి రెండు రోజుల్లో తప్పనిసరిగా లబ్ధిదారులు స్వగ్రామాల్లో ఉండేలా అవగాహన పెంపొందించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రతీ నెలా చివరి తేదీన నగదును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసే సమయంలో ఎంపీడీవోలకు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్, బ్యాంకు మేనేజర్లు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ ఎస్.నుపూర్అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డాక్టర్ వి.శివశంకరప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ముమ్మిడివరం, జూలై 6: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ఈనెల 15వ తేదీలోపు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు పూర్తిచేయాలన్నారు. ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సఖినేటిపల్లిలో అత్యధికంగా 61.2 మిల్లీమీటర్ల వర్షపాతం

అమలాపురం టౌన్, జూలై 6: జిల్లాలో శనివారం అత్యధికంగా సఖినేటిపల్లి మండలంలో 61.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా మామిడికుదురులో 10.8 మిల్లీమీటర్లతో సగటున 12.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 12.8 మిల్లీమీటర్లు, ఐ.పోలవరం 14.2, ముమ్మిడివరం 15.2, పి.గన్నవరం 16.4, అంబాజీపేట 12.8, రాజోలు 19.2, మలికిపురం 38.4, అల్లవరం 13, అమలాపురం 27.2, ఉప్పలగుప్తం 12.8, కాట్రేనికోన మండలంలో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం వద్ద అసోసియేషన్ ఉద్యోగుల ధర్నా దృశ్యం

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

- సమన్యాయం కోసం 1/2019 సర్క్యులర్‌ను అమలుచేయాలి
- ఉద్యోగులకు పూర్తి వైద్య సదుపాయం కల్పించాలి
- యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ధర్నా

అమలాపురం రూరల్, జూలై6: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండు చేస్తూ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం వద్ద యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 9 డిపోల నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యప్రకాశరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులకంటే ఆర్టీసీ ఉద్యోగుల పని పరిస్థితులు, పనివేళలు ఒకేలా ఉండవన్న విషయాన్ని ఆర్టీసీ యాజమాన్యం గుర్తించాలన్నారు. ఆర్టీసీ నిర్వహించిన సర్వేలోనే 90 శాతం ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఉన్నట్టు గుర్తించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అనారోగ్యాలతోపాటు రోడ్డు ప్రమాదాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆర్టీసీ ఉద్యోగులను ఈహెచ్‌ఎస్ నుంచి మినహాయించి గతంలో మాదిరిగా అన్‌లిమిటెడ్ రిఫరల్ వైద్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.గణపతి మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ వరుసగా రెండు రోజులు నిద్ర లేకుండా డ్యూటీకి పంపించడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు చనిపోయారని గుర్తుచేశారు. ఆర్టీసీలో సిబ్బంది సరిపోకపోవడంతో డబుల్ డ్యూటీలు, ఓవర్‌టైమ్ డ్యూటీలు చేయడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందన్నారు. డబుల్ డ్యూటీలను రద్దుచేసి ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్, మెకానికల్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండు చేశారు. రాష్ట్ర కార్యదర్శి బీఆర్కే కుమారి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షల విషయంలో సమానత్వం ఉండేలా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 1/2019 సర్క్యులర్‌ను జారీచేసిన విషయాన్ని యాజమాన్యం గుర్తించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆ సర్క్యులర్‌ను రద్దు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆర్టీసీలో ఖచ్చితంగా 1/2019 సర్క్యులర్‌ను అమలుచేయాలని డిమాండు చేశారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ నారాయణతోపాటు పలువురు నాయకులు మాట్లాడారు. తర్వాత జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవాలి

ముమ్మిడివరం, జూలై 6: నేషనల్ మీన్స్ మెరిట్ పరీక్షల్లో ఎంపికైన (ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న) విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోపుగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. 2023 డిసెంబరులో జిల్లావ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షల్లో స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. 2020-21-22 సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు కూడా రెన్యువల్ చేసుకోవాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థులు తాజా పునరుద్ధరణకు ఆగస్టు 31లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకునే విద్యార్థులకు తప్పనిసరిగా వన్‌టైమ్ రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే ఫేస్ ఆథరైజేషన్‌ను తమ మొబైల్ ఫోన్ ద్వారాగానీ, ఇతర ఫోన్ల ద్వారాగాని పూర్తి చేసుకోవాలని ఆమె సూచించారు.

రైతు సేవా కేంద్రాలుగా మారిన ఆర్బీకేలు

ఆర్బీకే లోగో, జగన్ ఫొటో ఉన్న బోర్డులు తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వుల జారీ

మండపేట, జూలై 6: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వివిధ శాఖల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇష్టారాజ్యంగా జగన్, వైఎస్ పేర్లతో వారి బొమ్మలు, పార్టీ రంగులతో నింపేసిన ప్రభుత్వ భవనాలపై తొలుత దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా వ్యవసాయశాఖలో పలు మార్పులను తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వంలో తీసుకువచ్చిన రైతుభరోసా కేంద్రాల పేరును మార్పుచేస్తూ వాటి స్థానే రైతు సేవా కేంద్రాలుగా నామకరణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈమేరకు ఇప్పుడు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఆర్బీకే లోగోతోపాటు మాజీ సీఎం జగన్ చిత్రంతో ఉన్న బోర్డులను తక్షణం తొలగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. మాజీ సీఎం జగన్ తన తండ్రి మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరిట రైతు భరోసా కేంద్రాలకు నామకరణం చేసింది. అయినప్పటికీ వాటి భవనాల నిర్మాణంపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వచ్చింది. జిల్లాలో రైతుభరోసా కేంద్రాలు మొత్తం 377 మంజూరుకాగా, అందులో 120 భవనాలు పూర్తయ్యాయని, మిగిలిన భవనాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని జిల్లా వ్యవసాయ సంచాలకులు బోసుబాబు చెప్పారు. ఆర్బీకే కేంద్రాల పేర్లను రైతుసేవా కేంద్రాలుగా ప్రభుత్వం మార్పుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. దానికి అనుగుణంగా జిల్లాలో రైతు భరోసాకేంద్రాల రంగులు, పేర్లను త్వరలోనే మార్పుచేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని, ఇప్పటికే ఈ అంశంపై మండల స్థాయి వ్యవసాయాధికారులకు ఆదేశాలు కూడా జారీచేశామని జిల్లా వ్యవసాయ సంచాలకులు బోసుబాబు చెప్పారు.



విగ్రహం ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కేసులో దోషులపై కఠిన చర్యలు : మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 6: రామచంద్రపురం మండలం అరుంధతీపేట వద్ద అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించిన దోషులను తక్షణం అదుపులోకి తీసుకుని కోర్టు ఎదుట హాజరుపరచి కఠినంగా శిక్షించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ డీఎస్పీ బి.రామకృష్ణను ఆదేశించారు. శనివారం రామచంద్రపురం మండలం వెల్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను డీఎస్పీని, సీఐ దొరరాజును అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి దుశ్చర్యలను ఎంతమాత్రం సహించేదిలేదన్నారు. అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన ప్రాంతంలో కొత్త విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తానని సుభాష్ దళిత నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వాడపల్లి ఆలయం కిటకిట



ఆత్రేయపురం, జూలై 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అన ంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.36.62 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్ ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, జూలై 6:మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,17,291 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

విత్తనాలు, ఎరువుల షాపుల్లో తనిఖీలు

గొల్లప్రోలు, జూలై 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో వ్యవసాయశాఖ రాష్ట్ర అధికారుల బృందాలు, విజిలెన్స్ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీకృష్ణా ఏజెన్సీస్, ప్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌ల్లో రికార్డులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలు పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరపాలని సూచించారు. తనిఖీల్లో శ్రీకాకుళం వ్యవసాయశాఖ డీడీ కె.త్రినాథస్వామి, విజిలెన్స్ అధికారి డీవీవీ సతీష్‌కుమార్, పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఏవో కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రసాద విక్రయ కేంద్రం



ప్రసాదాలు విక్రయిస్తున్న సిబ్బంది

అన్నవరం, జూలై 6: జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనదారుల కోసం ఏర్పాటు చేసిన సత్యదేవుడి నమూనాలయం వద్ద ప్రసాదం విక్రయాలను శనివారం నుంచి ప్రారంభించారు. ఈఈ నరసింహారావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం కౌంటర్ ప్రారంభించారు. ఎటువంటి సూచీ బోర్డులు లేకపోవడంతో మొదటిరోజు విక్రయాలు నామమాత్రంగానే జరిగాయి. భక్తులకు, వాహనదారులకు తెలిసే విధంగా సూచీ బోర్డులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

లోవకొత్తూరు శివారులో క్షుద్రపూజలు?

- గేదెదూడను బలివ్వడంతో భయాందోళన
- ప్రశ్నించిన ఓ వ్యక్తిపై దాడికి ప్రయత్నం
- చుట్టుపక్కల వారు రావడంతో పరారీ

తుని రూరల్, జూలై 6: కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు శివారులో సంచార వ్యక్తులు కొందరు క్షుద్ర పూజలు చేయడం కలకలం రేపింది. గ్రామ శివారులో అమావాస్య రోజు రాత్రి కొంత మంది వ్యక్తులు పూజలు నిర్వహించి దూడను బలి ఇవ్వడం సంచలనం రేకెత్తించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఒకరు వెళ్లి ప్రశ్నించగా మద్యం మత్తులో అతనిపై దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్థులు అందరూ ఒక్కసారిగా అక్కడకు వెళ్లగా పూజలు నిర్వహించిన వారు పరారయ్యారు. విషయాన్ని రూరల్ పోలీసులకు తెలియపరచగా రూరల్ ఎస్‌ఐ రమేష్‌బాబు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే ఎస్‌ఐ చెప్పిన వివరాలు ప్రకారం సంచార వ్యక్తులు అమావాస్య రోజున ఈ క్రమంలో పూజలు చేయడం ఆనవాయితీ అని తెలిపారని అయితే ఇవి క్షుద్ర పూజలు కాదని తెలిపినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామస్తులు ఎటువంటి భయాందోళనకు గురికావద్దన్నారు.



బలైన గేదెదూడ

కొబ్బరి చెట్ల ఫలసాయం వేలం పాటలో ఉద్రిక్తత

కె.గంగవరం, జూలై 6: కోట గ్రామ పంచాయతీ వద్ద శనివారం కొబ్బరి చెట్ల ఫలసాయం కోసం నిర్వహించిన బహిరంగ వేలం పాట ఉద్రిక్తతకు దారితీసింది. కోటిపల్లి - కాకినాడ ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి కోట గ్రామం వరకూ ఉన్న జిల్లా పరిషత్ రహదారి వెంట ఉన్న కొబ్బరి మొక్కల ఫల సాయం తీసుకునే హక్కులకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. 7 బిట్‌లుగా విడదీసి పాటలు పెట్టారు. వీటిలో 1వ బిట్‌లో ఉన్న 325 మొక్కలు ఫలసాయం పాట విషయంలోనే వివాదం జరిగింది. గత కొంత కాలంగా ఈ మొక్కలు గ్రామంలోని జనిపెల్ల కృష్ణమూర్తి, పాము లక్ష్మణరావు కుటుంబాల ఆధీనంలో ఉన్నాయి. తమకు ప్రభుత్వం 30 సంవత్సరాల క్రితం చెట్టు పట్టా పథకంలో ఈ చెట్లు కేటాయించిందని, అప్పటి నుంచి తాము వీటిని సంరక్షించుకుని వీటి నుంచి వచ్చే ఫలసాయంతో జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొంత కాలం తాము వీటి పై ప్రభుత్వానికి పన్ను చెల్లించామని ఇప్పుడు పంచాయతీ వారు తమ దగ్గర నుంచి తీసుకుని వేలం నిర్వహిస్తే ఎలా అని నిలదీసారు. పాట నిలుపుదల చేయాలని గొడవ చేశారు. వేలం నిర్వహిస్తే తాము పురుగుల మందు సేవిస్తామని పురుగుల మందు డబ్బాలతో రెండు కుటుంబాలకు చెందిన మహిళలు హడావిడి చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో జరిగిన గలాటాలో పాటదారులు చెల్లించిన ధరావత్తు సొమ్ము చెల్లాచెదురైంది. పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పామర్రు ఎస్‌ఐ. కె.జానీబాషా ఆధ్వర్యంలో అదనపు పోలీసు బలగాలను రప్పించి వేలం నిర్వహించారు. మొత్తంగా 7 బిట్‌లకు పాట నిర్వహణ చేయగా నాలుగు బిట్లుకు పాటను ఖరారు చేశారు. రెండు బిట్లకు ఆఫ్‌సెట్ ధర రాకపోవడంతో వాయిదా వేశారు. మరో బిట్‌కు ఎవరు పాటకు ముందుకు రాలేదు. ఐతే వివాదానికి కారణమైన 1వ బిట్‌ను కొండేపూడి వీరబాబు రూ. 6,50,000 హెచ్చు పాటదారునిగా ఖరారు చేశారు. ఈవోపీఆర్‌డీ నాగేంద్ర పర్యవేక్షణలో కార్యదర్శి ఎస్. సుబ్బారావు వేలం పాటలు నిర్వహించారు. దీనిపై గ్రామ కార్యదర్శి వివరణ కోరగా ఈనెల 3వ తేదీన సర్పంచ్ మల్లిడి సుశీల అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి కొబ్బరి చెట్ల ఫలసాయంపై బహిరంగ వేలం నిర్వహణకు తీర్మానం చేశామన్నారు. అప్పుడు జనిపెల్ల కృష్ణమూర్తి, పాము లక్ష్మణరావు కుటుంబాల వారు ఇవి తమ అధీనంలో ఉన్నాయని చెప్పారని దానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలని కోరామని, పాట రోజునైనా తీసుకురావాలని సూచించామని వారు ఏవిధమైన డాక్యుమెంట్లు చూపించలేదన్నారు.



జనాలను చెదరగొడుతున్న పోలీసులు

మాజీ ఉపసర్పంచ్ డీవీఆర్‌పై దాడికి యత్నం

పోలీసుల తీరుపై ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం

బిక్కవోలు, జూలై 6: కొమరిపాలెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి మాజీ ఉప సర్పంచ్ ద్వారంపూడి వెంకటరెడ్డిపై కొందరు వ్యక్తులు దాడికి ప్రయత్నించి విఫలమైనట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. డీవీఆర్‌కు సంబంధం లేని ఓ స్వీట్ స్టాల్ అగ్ని ప్రమాదానికి గురైందని, అందులో 10 గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని అవి పేలితే మరింత ప్రమాదం జరుగుతుందని వెంటనే రావాలంటూ కొందరు అర్ధరాత్రి డీవీఆర్ ఇంటికి వెళ్లి చెప్పారన్నారు. ఆ సమయంలో ఆయన ఇంటి నుంచి బయటకు వస్తే దాడి చేయవచ్చునని ప్రత్యర్థుల పన్నాగమని చెప్పారు. అయితే ఆయన కిటికీలోంచే సమాధానం చెప్పి పంపడంతో ఆ ముప్పు తప్పిందన్నారు.



స్వీటు షాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ఈ విషయాన్ని టీడీపీ నేత మాజీ జడ్పీటీసీ పడాల రాము శనివారం తెల్లవారుజామున 4.30కు బిక్కవోలు ఎస్‌ఐకు తెలియజేసినా వారు ఇప్పటివరకూ సంఘటనా స్థలానికి రాకపోవడంపై ఎమ్మెల్యే పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ వారు వైసీపీ వారి ఇంటిపై రాయి వేశారని దొంగ ఫిర్యాదు చేస్తే ఎస్పీ నుంచి కింది స్థాయి పోలీసుల వరకూ స్పందించి తమ కార్యకర్తలను వేధించేవారన్నారు. ఈసంఘటనకు పాల్పడిన వారి కంటే దీని వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పడాల రాము, డీవీఆర్, కూటమి నేతలు ఉన్నారు. ఈ సంఘటనపై స్వీట్‌స్టాల్ యజమాని ఖండవిల్లి విజయదుర్గ ఇచ్చిన ఫిర్యాదుపై స్టాల్‌ను స్వల్పంగా తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తుల మీద, డీవీఆర్ ఇంటికి అర్ధరాత్రి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తుల పైన దర్యాప్తు జరపాలంటూ ఇచ్చిన ఫిర్యాదులపైన రెండు కేసులు నమోదు చేశామని బిక్కవోలు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దాపురం, జూలై 6: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,78,140, అన్నదాన విరాళాలు రూ.52,616 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 5,720 తులాభారం రూ.200, లడ్డూ ప్రసాదం ద్వారా 19,620, కానుక ద్వారా 10 వేలు వెరసి రూ. 2,66,296 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

హుండీల్లో నగదు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గొల్లప్రోలు, జూలై 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని నగరపంచాయతీ షాపింగ్ కాంప్లెక్సులో గల వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీల్లో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం తెల్లవారుజాము మధ్య సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు బద్దలుకొట్టి హుండీలను పగలకొట్టారు. అందులో ఉన్న సుమారు రూ.50 వేల నగదు చోరీ చేశారు. దీనిపై ఆలయ కమిటీ ప్రతినిధులు సిద్ధా వీరబాబు, ముమ్మిడి ఈశ్వరరావు, మాదేపల్లి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు, క్లూస్ టీమ్ అధికారులు ఆలయం వద్దకు చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు.

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై మరమ్మతులు

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఒకటో ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలను నిలిపివేయనున్నారు. మే నెల 5న గూడ్సు రైలు రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌పై పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. దీంతో ఒకటి, రెండు ట్రాక్‌లకు పూర్తిగా మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. అదే నెల 16న రెండో ట్రాక్ మరమ్మతులను ప్రారంభించి గత నెల 18న పూర్తి చేశారు. ప్లాట్‌ఫాంపై టైల్సు వేసే పనులు ఆలస్యం కావడంతో మరి కొద్ది రోజులు సమయం పట్టింది. ప్రస్తుతం ఆ ట్రాక్‌పై ప్రయాణికుల, గూడ్సు రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయి. దీంతో ఒకటో ప్లాట్‌ఫాం ట్రాక్ పట్టాలను పూర్తిగా మార్చే పనిని చేయనున్నారు. దీని కోసం సోమవారం(9వ తేదీ) నుంచి సుమారు నెల రోజులపాటు ఈ ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలు నిలిపివేసే అవకాశం ఉంది. అధికశాతం రైళ్లను రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై నిలపనున్నారు. అవసరాన్ని బట్టి మూడు, నాలుగు ప్లాట్‌ఫాంలు కూడా వినియోగించనున్నారు. ఈ రెండు ప్లాట్‌ఫాంలపై ఇంకా షెడ్లు, బోగీల సంఖ్యలు తెలిపే సైన్ బోర్డులు లేకపోవడం గమనార్హం. వర్షాకాలం కావడంతో ఈ ట్రాక్‌లపై రైళ్లు నిలిపితే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



మంచు సోయగం



మోతుగూడెం, జూలై 6: చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పొగ మంచుతో కొండలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

బాలబాలాజీ ఆదాయం రూ.2,26,516

మామిడికుదురు, జూలై 6: అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,26,516 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ జి.మాదవి తెలిపారు. శనివారం స్వామి వారిని 2,841 మంది భక్తులు దర్శించుకున్నారని, 2,175 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



క్యూలో నిల్చున్న భక్తులు

రామచంద్రపురం మున్సిపల్ డీఈఈ గుండెపోటుతో మృతి



మండపేట/ద్రాక్షారామ, జూలై 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మున్సిపల్ డీఈఈ దుర్గాప్రసాద్ శనివారం గుండెపోటుతో షిర్డీలో మృతి చెందారు. దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా రెండు రోజులు క్రితం షిర్డీ వెళ్లారు. ఆయన శనివారం స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉండగా గుండెపోటు రావడంతో క్యూలైన్‌లోనే ప్రాణాలు విడిచారు. దుర్గాప్రసాద్ సమర్థవంతమైన అధికారిగా మంచి పేరుంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన సుదీర్ఘకాలం మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా, డీఈఈగా ఆయన ఇక్కడ పనిచేశారు. విజయవాడ నగర కార్పొరేషన్‌లో కూడా విధులు నిర్వర్తించారు. మండపేట నుంచి రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయానికి పదోన్నతిపై డీఈఈగా బదిలీ అయ్యారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, రెడ్డి రాజబాబు, మండపేట మున్సిపల్ డీఈఈ ఆర్.శ్రీనివాస్, మున్సిపల్ ఆర్‌ఐ ఐ.ప్రభాకరచౌదరి, మండపేట, రామచంద్రపురం మున్సిపల్ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

చేపల మృత్యువాత

ఆక్సిజన్ అందక చనిపోతున్న సముద్రపు చిన్న చేపలు



ఒడ్డున మృతిచెందిన చేపలు



యానాం, జూలై 6: యానాం గౌతమి గోదావరి నది ఒడ్డున సముద్రపు చేపలు మృత్యువాత పడి తేలాయి. సాయంత్రం చేపలు చనిపోయి ఒడ్డుకు చేరిపోవడంతో స్థానిక మత్స్యకారులు అక్కడికి చేరుకున్నారు. గోదావరిలో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల యానాం గోదావరికి చప్ప నీరు వస్తుందని, దీంతో ఆక్సిజన్ అందక సముద్రపు చిన్నసైజు చేపలు చనిపోయి ఒడ్డుకు చేరాయన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

యానాం, జూలై 6:యానాం-ఎదుర్లంక జీఎంసీ బాలయోగి వారధి పైనుంచి శనివారం వివాహిత గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన గుత్తుల పద్మకుమారి వారధి పైనుంచి గోదావరిలోకి దూకింది. అక్కడే సమీపంలో ఉన్న సీగల్స్ సిబ్బంది ఆమెను రక్షించారు. ఆమెను యానాం ప్రభు త్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యయత్నానికి గల కారణలు తెలియలేదు.కేసును యానాం నుంచి ఐపోలవరం పోలీసులకు బదలాయించారు.

- రామచంద్రపురం మండల సమావేశంలో తీర్మానం
- సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల మద్దతు
- నాడు - నేడు పనుల నిలిపివేతపై సభ్యుడి ప్రశ్న

పింఛన్ల పెంపుతో కూటమి నేతలకు పాలాభిషేకం



కూటమి నేతల చిత్రాలకు పాలాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 6: దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచి మాట నిలుపుకున్న కూటమి నేతలకు దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతా సభ శనివారం నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో దివ్యాంగ సంఘ నాయకులు పి.శ్రీనివాసరావు, కోరశ సుబ్రహ్మణ్యం, మోటూరి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్ అందించి నాటి నుంచి నేటి వరకు ఆదుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం కూటమి నేతలైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధాని నరేంద్రమోదీలతో పాటు మందకృష్ణమాదిగ చిత్రపటాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లింగోలు పండు, యేడిద శ్రీను, మల్లుల పోలయ్య, మంద గెద్దయ్య, తిక్కా సత్యలక్ష్మి, మోటూరి కనకదుర్గ, చొల్లంగి సత్యసాయిబాబా, పొలమూరి ధర్మపాల్, ఆకుల బుజ్జి, దివ్యాంగ సంఘ నాయకులు ధర్నాడి సత్యం, సుంకర రాజు పాల్గొన్నారు. అనంతరం ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు దంపతులు 50మందికి దుప్పట్లు, 30మందికి నూతన వస్త్రాలను ఎమ్మెల్యే ఆనందరావు చేతులమీదుగా పంపిణీ చేశారు.

'రామచంద్రపురాన్ని' కాకినాడ జిల్లాలో కలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

ద్రాక్షారామ, జూలై 6: రామచంద్రపురం మండలాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. మండల సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం రామచంద్రపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన జరిగింది. కాపవరం ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటులో రామచంద్రపురం మండలాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో ఉంచారని, నియోజకవర్గంలోని కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలో కలిపారని అన్నారు. రామచంద్రపురం నుంచి జిల్లా కేంద్రం అమలాపురానికి గోదావరి దాటి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఎంపీ బోస్, మంత్రి సుభాష్ సహకారంతో రామచంద్రపురం మండలాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అందుకు సభ్యుల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ అంబటి తుకారాం మాట్లాడుతూ రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని సర్పంచ్‌ల తరపున మద్దతు ప్రకటించారు. వెల్ల ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు మాట్లాడుతూ జనసేన పార్టీ తరపున తీర్మానానికి మద్దతు ప్రకటించారు. ఎంపీపీ అంబటి భవానీ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో రామచంద్రపురం మండలాన్ని కలపాలనేది మండల ప్రజలు, ప్రజాప్రతినిధుల అభీష్టమన్నారు. రామచంద్రపురం మండలాన్ని కాకినాడ జిల్లాలో కలపాలనే తీర్మానానికి సభ్యులు కరతాళధ్వనులతో మద్దతు పలికారు. మండలంలో కౌలు రైతుల కార్డుల జారీపై సర్పంచ్ అంబటి తుకారాం తహసీల్దార్‌ను ప్రశ్నించారు. పాఠశాలల్లో నాడు నేడు పనులు నిలిచిపోవడంపై ఎంఈవోను ఎంపీటీసీ సభ్యుడు చిక్కాల స్వామికాపు ప్రశ్నించారు. సిమెంటు, ఇసుక కొరతతో నిలిచిపోయినట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలలో అడ్మిషన్లు, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై చర్చ జరిగింది. ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేసి నివేదికలు ఉన్నతాధికారులకు ఇవ్వాలని ఎంఈవోకు ఎంపీ బోస్ సూచించారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ సభ్యుల సమస్యలకు అధికారులు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని, తదుపరి సమావేశంలోనైనా సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శాకా బాబి, నరాల రాజ్యలక్ష్మి, ప్రత్యేకాధికారి రాజు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీరామచంద్రమూర్తి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాజోలు ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా: ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జూలై 6: రాజోలు నియోజకవర్గంలోని ప్రజలందరికీ తాగునీరు ప్రతీరోజు, ప్రతీ ఇంటికి అందించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం గుడిమెల్లంక రక్షిత మంచినీటి పథకంలోని ప్రతీ అంశాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఫిల్టర్ బెడ్స్, 35 ఎకరాల చెరువును, డంపింగ్ విధానాన్ని, క్లోరినేషన్ విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో 215హేబిటేషన్లు ఉండగా 78ఆవాస ప్రాంతాలకు గుడిమెల్లంక రక్షిత మంచినీటి పథకం ద్వారా సాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. ఫిల్టరేషన్ సరిగా లేదని, విద్యుత్ సరఫరా సరిపడా లేదని ఆయన గుర్తించారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు సమకూర్చిన రూ.5కోట్లకు పాటు మన వద్ద ఉన్న నిధులను అవసరం లేనివాటికి ఇచ్చారని, వాటిని కూడా ఈపథకానికి మళ్లిస్తే నిరంతరం తాగునీరు అందించవచ్చన్నారు. సఖినేటిపల్లిలో పది ఎకరాల స్థలాన్ని సేకరించి మరో పథకాన్ని రూపకల్పనచేస్తే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట డీఈఈ రాజన్, ఏఈలు సత్యనారాయణరాజు, శిరీష, గుండుబోగుల పెదకాపు, పినిశెట్టి బుజ్జి, ఇంటిపల్లి ఆనందరాజు, చెల్లింగి సత్యనారాయణ, మల్లిపూడి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి

కొత్తపేట, జూలై 6: నియోజకవర్గంలో అనాధికార బెల్ట్ షాపులు, అక్రమ మద్యం ఏరులైపారుతుందని, ఎక్సైజ్ అధికారులు దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి ఒక ప్రకటనలో కోరారు. రావులపాలెంలో ఆర్టీసీ బస్టాండ్‌ను అనుకుని బెల్ట్‌షాపులలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు చొరవ చూపి అక్రమ వ్యాపారులపై చర్య తీసుకోవాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు అరికట్టాలి

అల్లవరం, జూలై 6: రామచంద్రపురం మండలం వెల్ల అరుంధతిపేట వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో దోషులను అరెస్టు చేయాలని కుల వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిబత్తుల తులసి దుర్గారావు డిమాండ్ చేశారు. గోడిలంకలో దుర్గారావు అధ్యక్షతన జరిగిన కుల వ్యతిరేక పోరాట సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు.గెడ్డం విజయకుమార్, తాడి రాజ్‌కిరణ్, కుంచే సుభాష్, యల్లమిల్లి బాబి, ఉప్పే సతీష్, ఊటాల రాంబాబు, గోసంగి వెంకటేష్ పాల్గొన్నారు.

గోదావరి వరదలపై సమీక్ష

అల్లవరం, జూలై 6: గోదావరి వరదల నేపథ్యంలో శనివారం తహసీల్దారు కార్యాలయంలో ముందస్తు చర్యలపై తహసీల్దారు సునీల్‌కుమార్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏటిగట్ల పరిరక్షణ, వరద ముంపు ప్రాంతాల్లో చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వరదలకు బోడసకుర్రు, పల్లిపాలెంగ్రామాలు ముంపుబారిన పడుతున్నాయన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు బీఎస్పీ నిరసన

అమలాపురం టౌన్, జూలై 6: బహుజనసమాజ్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి బహుజన సమాజ్‌పార్టీ సీనియర్ నాయకులు బత్తుల లక్ష్మణరావు, జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీభవానీ, జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. అమానుష దాడిని నిరసిస్తూ నినాదాలు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి జాన్‌మోషే, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, అసెంబ్లీ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, పెండెం శ్రీనివాస్ పాలొన్నారు.

ద్వారపూడి పంచాయతీలో గ్రామసభ రసాభాస

మండపేట, జూలై6: ద్వారపూడి పంచాయతీలో శనివారం నిర్వహించిన గ్రామసభ అరుపులు, కేకలతో దద్దరిల్లింది. పాలకపక్షంపై టీడీపీ, జనసేన శ్రేణులు మాటల దాడితో గ్రామసభ వాడివేడిగా సాగింది. గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన సమావేశానికి అన్నీతానై గ్రామ ఉపసర్పంచ్ తులా శేషారావు వ్యవహరించి ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రజలందరి ఆమోదంతో పనులు చేపట్టాలని జనసేన నేత చింతా దొరబాబు కోరారు. వ్యాపారుల నిధులతో చేపట్టిన పంచాయతీ షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణంపై టీడీపీ, జనసేన నేతలు పల్లా వీరబాబు, చింతా దొరబాబు మాట్లాడుతూ దుకాణదారుల నుంచి షాపుల నిర్మాణం కోసం రూ6.5లక్షలు వంతున వసూలు చేశారని ఆరోపించారు. షాపుల నిర్మాణం కోసం ఒక్కో వ్యాపారి నుంచి రూ.4.5లక్షలు వసూలు చేశామని ఉపసర్పంచ్ శేషారావు సమాధానం చెప్పారు. పంచాయతీ ఆమోదంతో పనులు చేశామని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో విచారణకు సిద్ధమని ఉపసర్పంచ్ చాలెంజ్ చేశారు. దుకాణ యజమానులు నుంచి వసూలు చేసిన సొమ్ములు ఏమయ్యాయి, ఎవరెవరికి దుకాణాలు కేటాయించారు, అందరూ డిపాజిట్లు కట్టారా అని పలువురు ప్రశ్నించారు. మూడేళ్లలో గ్రామంలో ఏమీ చేశారంటూ టీడీపీ జనసేన నేతలు ప్రశ్నించారు. గ్రామంలో రహదారుల ఆక్రమణ, అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కోళ్లఫారం గురించి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో పాలకవర్గానికి, టీడీపీ, జనసేన నాయకులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అరుపులు, కేకలు నడుమ గ్రామసభ సాగింది. పలు సందర్భాల్లో ప్రజలు వేసిన ప్రశ్నలకు వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ శేషారావు విసుగు చెంది నేను ఇలానే చేస్తా, మీరు అధికారంలో ఉన్నపుడు చేయలేదా అంటూ అసహనం వ్యక్తం చేసి చేతనైంది చేసుకోండంటూ టీడీపీ, జనసేన శ్రేణులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభలో అధికార పార్టీకి చెందిన వారు వేసిన ప్రశ్నలకు పాలకవర్గ ఉక్కిరి బిక్కిరైంది. సమావేశంలో నాలుగు అంశాలను ఆమెందించారు. సభలో పంచాయతీ కార్యదర్శి ఆకుల వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, బుల్లబ్బు, సాలా సత్యనారాయణ, పల్లాబాబు, పల్లా వీరబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేగుళ్లను సత్కరించిన ఆటో యూనియన్ సభ్యులు



మండపేట, జూలై 6: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును శనివారం పలువురు సత్కరించారు. మండ పేటకు చెందిన గణేష్ ఆటో యూనియన్ సభ్యులు వేగుళ్లను కలిసి సత్కరించారు. కపిలేశ్వపురం మండలం ఇటుక బట్టీ యజమానులు, వెలగతోడు, పాలతోడు, ఇప్పనపాడు, తాపేశ్వరం గ్రామాల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, పట్టణ హీరోహోండా షోరూం యజమానులు వేగుళ్లను సత్కరించారు.

సీఎం ఎవరో తెలియదా!

అమలాపురం రూరల్, జూలై 6: శనివారం గున్నేపల్లి అగ్రహారంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తుండడాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పరిశీలించారు. ఆవాహనంపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉండడంతో డ్రైవర్‌ను నిలదీశారు. అసలు సీఎం ఎవరో తెలుసా అంటూ మండిపడ్డారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చంద్రమౌళి హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా మీడియా కోఆర్డినేటర్ మంథా ఫణికుమార్ ఉన్నారు.దీంతో ఆ వాహనంపై జగన్ ఫొటో కనిపించ కుండా వాహన డ్రైవర్ రంగు వేశారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

ఐ.పోలవరం, జూలై 6: మురమళ్ల శ్రీవీరేశ్వరస్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి తల్లాప్రగడ మల్లికార్జునరావు దంపతులు దర్శించుకున్నారు. జడ్జి దంపతులకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ విశిష్టత గురించి అర్చకులు వివరించారు. ప్రత్యేక దర్శనం అనంతరం వేదఆశీర్వచనం చేశారు. జడ్జి దంపతులకు నూతన వస్త్రాలు, స్వామివారి చిత్రపటాన్ని ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ అందజేశారు.

వాటర్‌ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం, జూలై 6: గుత్తినదీవి గ్రామ సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవి బుల్లియ్య ఆర్థిక సాయంతో నిర్మించిన మంచినీటి ట్యాంకును శనివారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. గంగాబత్తుల సన్యాసిరావు, చిక్కాల శ్రీనివాస్, ములపర్తి దుర్గకుమారి, లంకలపల్లి స్వామి, పడాల లక్ష్మణరావు, ముమ్మిడివరపు అర్జున్, యేలిపే జ్యోతి, ములపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జంతువ్యాధుల దినోత్సవం

కపిలేశ్వరపురం, జూలై 6: అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ జంతువ్యాధుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి(డీహెచ్‌ఒ) డాక్టర్ కె.వెంకట్రావు ముఖ్యఅతితిగా మాట్లాడారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులైన రేబిస్, బర్డ్‌ఫ్లూ, తదితర వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆలమూరు సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత, స్థానిక పశువైద్యాధికారి వీవీ రమణమూర్తి, పాఠశాల హెచ్ఎం ఎ.రాజు, పాల్గొన్నారు.

సుంకర ట్రస్టు సేవలు అభినందనీయం



మండపేట, జూలై 6: సుంకర వెంకట రమణ చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ద్వారపూడికి చెందిన టీడీపీ నేత సుంక రవెంకటరమణ పేరిట ఆయన కుటుంబ సభ్యులు శని వారం ద్వారపూడిలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబి రాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. తొలుత సుంకర చిత్రపటానికి వేగుళ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంద మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. భారీగా అన్నసమారాధన చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫి కెట్లు అందించారు. స్థానిక బాలికల హైస్కూల్లో విద్యార్థి నులకు నోట్‌పుస్తకాలు అందించారు. సుంకర కుటుంబ సభ్యులు, సుంకర నాని, మాజీ సర్పంచ్ మర్రెడ్డి శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, చిక్కాల శ్రీను, ఉపసర్పంచ్ తులా శేషారావు, మాజీ ఎంపీటీసీ పిల్లి మీనా పాల్గొన్నారు.

బాలబాలాజీని దర్శించుకున్న ఆర్డీవోలు

మామిడికుదురు, జూలై 6: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామిని కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు జీవీవీ సత్యనారాయణ, ఎస్.సుధాసాగర్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తొలుత వారికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేదాశీర్వచనం అందించగా ఏసీ జి.మాధవి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

సంక్రమిత వ్యాధులపై అవగాహన

అమలాపురం రూరల్, జూలై 6: పశువుల నుంచి మానవులకు సంక్రమించే సంక్రమిత వ్యాధులపై శనివారం వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అమలాపురం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఏటా జరుపుకునే సంక్రమిత వ్యాధుల దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగసత్యనారాయణ, డాక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో భాగస్వామినవుతా: ఎమ్మెల్యే

పి.గన్నవరం, జూలై6: లంకగ్రామాల కలనెరవేరే రోజు దగ్గరలోనే ఉందని, లంక గ్రామాలను కలిపే వంతెన నిర్మాణం పూర్తయ్యేవరకు నేనూ మీతో భాగస్వామినవుతానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారులకు, కాంట్రాక్టర్లకు హామీ ఇచ్చారు. నిధులు విడుదలలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. గంటిపెదపూడిలో రూ.49.50కోట్లు ఏఐబీ నిధులతో నిర్మాణం జరుగుతున్న వంతెన పనులను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. పలు సందేహాలను పంచాయితీరాజ్ డీఈ అన్యం రాంబాబును అడిగి తెలుసుకున్నారు. ఏఈలు బి.దుర్గాకొండలరావు, పి.సత్యనారాయణ, ఎంపీపీ గనిశెట్టినాగలక్ష్మి, సర్పంచ్‌లు దంగేటి అన్నవరం, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణుకు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 6: మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను శనివారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎస్ఆర్ఎంటీ అధినేత కంటిపూడి శారధి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తదితరులు పరామర్శించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవెంకటేశ్వరాలయం

అయినవిల్లి, జూలై 6: నల్లచెరువులో గల శ్రీఅలివేలుమంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి శ్రీవెంకటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించుకున్నారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వరదలు ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి

మామిడికుదురు, జూలై 6: వరదల సమయంలో ఏర్పడే ఇబ్బందులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ ఎం.మేరికమ్మ పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వరదల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఇసుక బస్తాలు సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ పి.సురేష్, డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్య పాల్గొన్నారు.

జోగేశ్వరరావును సన్మానించిన కమ్మ పెద్దలు

ద్రాక్షారామ, జూలై 6: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును మండపేటలో రామచంద్రపురం కమ్మపెద్దలు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. వైట్ల సూర్యప్రకాశ రావు, బొల్లం రెడ్డి శ్రీహరి, మార్ని సుబ్బారావు, రిమ్మలపూడి సతీష్, గుణ్ణం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాబీస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు, జూలై 6: కుక్కల ద్వారా సక్రమించే ర్యాబీస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, కుక్క కాటుకు గురైన రోజునే వ్యాక్సిన్ వేయించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి కె.వెంకట్రావు, ఆలమూరు ఏడీ ఎల్.అనిత సూచించారు. ఆలమూరులో పెంపుడు కుక్కలకు ఆయన వ్యాక్సిన్ వేశారు.

హెల్మెట్లు ధరించకపోవడం వల్లే మరణాలు

అమలాపురంరూరల్, జూలై 6: వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం వల్లే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు పేర్కొన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో రోడ్ సేఫ్టీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపుఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా మాట్లాడారు. కిమ్స్ డీన్‌ఆనంద్‌ఆచార్య ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో న్యాయవాదు డీవీవీఎస్ మూర్తి, కేవీవీ శ్రీనివాసరావు, రూరల్‌సీఐ పి.వీరబాబు, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

టీడీపీ నేత జగడం జన్మదిన వేడుకలు

రాజోలు, జూలై6: బి.సావరంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకులు జగడం సత్యనారాయణ జన్మదిన వేడుకలు శనివారం నాయకులు నిర్వహించారు. అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఆయన కట్‌చేసి పంచారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం ఇచ్చారు.

గుర్తుతెలియని మృతదేహానికి పోలీసుల దహన సంస్కారం

రావులపాలెం, జూలై 5: రావులపాలెం పరిధిలో బొబ్బర్లంక- ముక్తేశ్వరం ప్రధాన పంటకాలువలో ఈనెల3న గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటనపై ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు. మృతుడి వివరాల కోసం పత్రికల్లో, సోషల్ మీడియాలో, సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చినప్పటికి వివరాలు తెలియలేదు. దీంతో కొత్తపేట ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం స్టేషన్ సిబ్బంది శ్రీనివాస్, గోపి మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లాలో 2.25లక్షల పశువులకు టీకాలు



జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు

ఆలమూరు, జూలై 6: జిల్లాలో 2.25లక్షల పశువులకు గొంతువాపు, గాలికుంటువ్యాధి టీకాలు అందించాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 85శాతం పూర్తి చేసినట్లు జిల్లా పశువైద్యాధికారి (డీహెచ్‌వో) కె.వెంకట్రావు తెలిపారు. 52వేల గొర్రెలకు చిటిక వ్యాధి టీకాలువేయాలసి ఉండగా 44వేల గొర్రెలను అందించినట్లు చెప్పారు.ఆలమూరులో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఆవుజాతిలో వచ్చే లంప్‌స్కిన్ పూర్తిగా అదుపులో ఉందని, అయితే ముందు జాగ్రత్త చర్యగా వ్యాక్సిన్‌ఈనెల20నుంచి అందించడానికి ఏర్పాట్లు చేశామ న్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా ఎస్సీ ఏరియాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహించి మందులు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రతీ మండలంలో ఒకచోట క్యాంపు నిర్వహిస్తామన్నారు. అధిక శాతం ఆడ దూడలు జన్మించే విధంగా రూపొందించిన సెమన్‌ను (వీర్యం) రైతులకు రూ.1500 కాగా రైతులకు రూ.500 అందిస్తామన్నారు. సమావేశంలో ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత, పశువైద్యాధికారి భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

ముమ్మిడివరం, జూలై 6: ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ల విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పిలుపునిచ్చారు. ర్యాలీ ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు తాళ్లరేవు మండలం సుంకరపాలెం నుంచి ప్రారంభమై అక్కడి నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ఐ.పోలవరం, ముమ్మిడివరం మండలాల మీదుగా అమలాపురం చేరుకుంటుందన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై అవగాహన సదస్సు

ఆలమూరు, జూలై 6: లంక భూములలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేయడం నిషేధమని, ఈవిషయాన్ని ఇటుకబట్టీ యాజమాన్యులు గుర్తించాలని తహశీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన సర్పంచ్ దంగేటి చంద్రకళ ఆధ్వర్యంలో తహశీల్దార్ అనిల్‌కుమార్ ఇటుకబట్టీ యాజమాన్యులకు శనివారం చొప్పెల్ల పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటుకబట్టీలకు లంకమట్టి తరలింపుపై నిషేధం నేపథ్యంలో లంక మట్టి తవ్వకాలు చేయడం వీలుకాదన్నారు.

రాహుల్ గాంధీ హిందూవులకు క్షమాపణ చెప్పాలి

రాయవరం, జూలై 6: పార్లమెంట్‌లో హిందూవుల పట్ల, హిందూ దేవతల పట్ల అవమానకరంగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, రాహుల్ గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్, ధర్మవీర్ హిందూ ఆధ్యాత్మిక చైతన్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం రాయవరంలో వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పకపోతే అతడి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, శాకా దుర్గా శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, ఈరెళ్ల కృష్ణమూర్తి, గుబ్బల వెంకరమణ తదితరులు పాల్గొన్నారు.

బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి

అమలాపురం టౌన్, జూలై 6: మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో మాదిగల పొలిటికల్ జేఏసీ మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్, డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలని పలువురు నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండుచేశారు. నాయకులు యార్లగడ్డ రవీంద్ర, పెనుమూరి జాన్సన్‌బిల్లీ, మడికి సత్యనారాయణ, మట్టా నాగేశ్వరరావు, నవుండ్రు లక్ష్మణరావు, సీలి సంసోను, నేదునూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా

పి.గన్నవరం, జూలై 6: నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న ప్రతి రహదారిని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం-అమలాపురం ప్రధాన రహదారికి గుంతలు పూడ్చే పనులు ప్రారంభించి అనంతరం మాట్లాడారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, చొల్లంగి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, నక్కా సత్యనారా యణ, యడ్ల ఏసు, శేరు శ్రీనుబాబు, షేక్ దొరబాబు, పెచెట్టి ఈశ్వర్ పాల్గొన్నారు.